క్లుప్తంగా

బల్దియా శానిటరి సూపర్‌వైజర్‌గా నరేందర్

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ శానిటేషన్ విభాగంలో శానిటరి సూపర్‌వైజర్‌గా నరేందర్ నియామకమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. ఆదిలాబాద్‌లో శానిటరి ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం నరేందర్‌ను పదోన్నతిపై నిజామాబాద్ కార్పొరేషన్‌కు అధికారులు బదిలీ చేశారు. అయితే బల్దియాలో డిప్యుటేషన్‌పై శానిటరి సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న సాజిద్ అలీ తిరిగి తాను నియామకమైన కార్పొరేషన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. నూతనంగా నియామకమైన నరేందర్ బాధ్యతలు చేపట్టనున్నారు.

రాయల చంద్రశేఖర్ వర్ధంతి సభ



సిరికొండ: మండలంలోని గడ్కోల్‌లో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు రాయల చంద్రశేఖర్ వర్ధంతి సభను పార్టీ శ్రేణులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రమేశ్, దామోదర్, రమ, లింబాద్రి, రాములు, అనీస్, కిశోర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో నమస్తే డే



నిజామాబాద్ సిటీ: వంద రోజుల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా 'నమస్తే డే' కార్యక్రమం నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బల్దియా కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంహెచ్‌వో రవిబాబు 'నమస్తే డే' లో పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. 12 మంది కార్మికులకు పీపీఈ కిట్‌లు అందించారు. కార్మికులు సురక్షిత విధానాలు అవలంభించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

21న విష్ణు సహస్రనామ పారాయణం

నిజామాబాద్ రూరల్: నగర శివారులో ఉన్న బోర్గాం(పి)లో ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి మహా ఆలయంలో ఈ నెల 21న విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ అరుణ్ కుమార్ శర్మ బుధవారం తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిరంతరం సాగుతున్న తరుణంలో ఈ ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని 21 మందితో సామూహికంగా పారాయణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పారాయణంలో పాల్గొన్నవారికి అల్పాహారం, అన్నప్రసాదం ఉంటుందని అన్నారు.

జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియామకం


నల్ల మహేందర్

సిరికొండ: తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొండాపూర్ గ్రామానికి చెందిన నల్ల మహేందర్ నియామకమయ్యారు. ఆయనను నియమిస్తూ సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు బి చెన్నయ్య నియామకపత్రం జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సమస్యలపై వారికి రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు పని చేయాలని చెన్నయ్య కోరారు. సంఘం ఆశయాలకు, బహుజన మహనీయుల ఆశయాలను సమాజంలోకి తీసుకెళ్లడానికి మహేందర్ కృషి చేస్తారని ఆయన తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,700	వెండి(కిలో)	1,16,000
22 క్యారెట్స్	91,112	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సుడ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	70	పచ్చిమిర్చి	70	100
బీరకాయ	30	50	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	80	120	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	50	70
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	30	50
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	40	70
పుదీనా	60	90	గోరుచిక్కుడు	50	80
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్

శ్రీనగర్‌కాలనీలో గల్లీ ఆక్రమణ..!

- 30 ఫీట్ల రోడ్డు కబ్జా
- స్థానికుల అభ్యంతరంతో గతంలో పనులు నిలిపివేత
- ప్రస్తుతం గేట్లు బిగించి స్వాధీనంలోకి
- వెహికిల్ సర్వీసింగ్ సెంటర్ నిర్వహణ
- పట్టించుకోని బల్దియా అధికారులు


30 ఫీట్ల రోడ్డుకు గేట్లు బిగించి తాళం వేసిన దృశ్యం


రోడ్డును ఆక్రమించి చేపట్టిన పనులు (ఫైల్)

నిజామాబాద్ సిటీ: నగరంలోని 45వ డివిజన్ శ్రీనగర్‌కాలనీలో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ స్థలాన్ని కబ్జాకు యత్నిస్తున్నారు. యెండల టవర్‌కు వెళ్లే మెయిన్ రోడ్డుకు అతి సమీపంలోని ఓ చివరి సంధును అక్రమార్కులు తమ ఆధీనంలోకి తీసుకొని డిసెంబర్ నెలలో పులాంగ్‌వాగు రెయిలింగ్‌ను అనుకుని ఉన్న చెట్లను తొలగించారు. 30 ఫీట్ల రోడ్డును ఆక్రమిస్తూ గదులు నిర్మిస్తుండగా స్థానికులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. కమిషనర్ ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు పనులు నిలిపివేసి పునాదులను తొలగించారు. అప్పటి అధికారులు ప్రస్తుతం లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన వారు ఆ స్థలాన్ని ఓ వెహికిల్ సర్వీసింగ్ సెంటర్‌కు అద్దెకు ఇచ్చారు. అందులో భాగంగా ఈసారి ఏకంగా గేట్లు బిగించారు. కొత్తగా వచ్చినవారెవరైనా చూస్తే అది ఖచ్చితంగా ప్రైవేట్ స్థలం అనుకునేలా కబ్జా చేశారు. కబ్జా విషయమై స్థానికులు ఏసీపీ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు స్పందించడం లేదు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కబ్జా చేస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం నేరం. స్వంత స్థలాల్లో మాత్రమే అనుమతి తీసుకొని నిర్మాణాలు చేపట్టాలి. ప్రజల కోసం వదిలిపెట్టిన రోడ్లు, గల్లీల్లో నిర్మాణాలు చేపట్టవద్దు. శ్రీనగర్‌కాలనీలో 30 ఫీట్ల రోడ్డును కొందరు ఆక్రమించినట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. సిబ్బందిని పంపించాం. ఆక్రమ నిర్మాణాలైతే జేసీబీతో వెంటనే కూల్చివేస్తాం.

– శ్రీనివాస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్(బల్దియా)

నేటి చిత్రం


కోటగల్లిలో రోడ్డుమీద పేరుకుపోయిన చెత్త

రోడ్డుమీద చెత్త తొలగించరూ..

నిజామాబాద్ సిటీ: నగరంలోని ప్రధాన రోడ్లపై చెత్తను తొలగించడంలో పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రోడ్డుమీద ఉన్న చెత్తతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కోటగల్లిలోని మాణిక్‌భవన్ పాఠశాల ఎదురు గల్లిలో చెత్తతో చాలా ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

– సిందిజ్ రాజు, కోటగల్లి

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 | నిజామాబాద్ రూరల్ - 97053 46541

సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు రూపం బోనాలు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు నిలువెత్తు నిదర్శనమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని అహ్మద్‌పుర కాలనీ గంగపుత్ర, మరాఠీ, బోయి సంఘం వారి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన అంబబాయి బోనాల పండుగ ఊరేగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండేలా చూడాలన్ని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్షి రాజు, థాంకనే కిశోర్, థాంకనే నారాయణ, గౌతె రాజు, థాంకనే సుశీల బాయి, మరవర్ కృష్ణ, సుగంధం హరీశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శంకర్ భవన్ పాఠశాలలో..

నిజామాబాద్ అర్బన్: నగరంలోని కోటగల్లి శంకర్ భవన్ పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామచందర్ గైక్వాడ్, ఉపాధ్యాయులు దయానంద్, ప్రసన్నలక్ష్మి, సవిత, మమత, సౌందర్య, నందిని, సంతోష్, ముకుంద పాల్గొన్నారు.



తాళ్లరామడుగులో..



సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు ప్రభుత్వ పాఠశాలలో బోనాల పండుగను బుధవారం నిర్వహించారు. విద్యార్థులు బోనాలతో సందడి చేశారు. ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్రవర్ణాల రిజర్వేషన్లను తొలగించాలి



నిజామాబాద్‌నాగారం: అగ్రవర్ణాలకు కల్పించిన పది శాతం రిజర్వేషన్లను వెంటనే రద్దు చేసి, ఆ కోటాను బీసీలకు వర్తింపజేయాలని తెలంగాణ బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్టలో బుధవారం చంద్రశేఖర్‌గౌడ్‌ను అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. త్వరలో లక్షలాది బీసీలతో సమావేశం నిర్వహించి భవిష్యత్తు ప్రణాళిక ప్రకటిస్తామని అన్నారు. కార్యక్రమంలో హెచ్ రేవంత్, కరిపె రవీందర్, కె నాగరాజు, పోల శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సభ్యులు

నిజామాబాద్ నాగారం: విద్యార్థులు బాగా చదువుకొని జీవితంలో స్థిరపడాలని లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూరు సభ్యులు సూచించారు. నగరంలోని కంఠేశ్వర్‌లో ఉన్న గుర్బాబాది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం కృపాల్‌సింగ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్బాయి లింబాద్రి, కార్యదర్శి పి రాఘవేంద్ర బాబు, కోశాధికారి అంకం రాజేందర్, డిస్ట్రిక్ట్ చైర్మన్లు రమేశ్‌బాబు, జిల్కర్ విజయానంద్, పూర్వ అధ్యక్షుడు ఇరుమల శివలింగం, పూర్వ డిస్ట్రిక్ట్ చైర్మన్ రామకృష్ణ రెడ్డి, హెచ్‌ఎం చిన్నస్వామి, ఉపాధ్యాయురాలు శ్రీవాణి పాల్గొన్నారు.

మోపాల్/ నిజామాబాద్‌అర్బన్: నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో సతీశ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు వేల నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం శంకర్, ట్రస్ట్ ప్రతినిధులు రాజేశ్వర్, నరేందర్ ఉపాధ్యాయులు బి శ్రీనివాస్, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు. నగరంలోని కోటగల్లి జీపీఎస్ పాఠశాలలో సతీశ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మల్లేశ్, రామచందర్ గైక్వాడ్, ఉపాధ్యాయులు దయానంద్, ప్రసన్న లక్ష్మి, సవిత, మమత, సౌందర్య, నందిని, సంతోష్, ముకుంద్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు షూస్ వితరణ

జక్రాన్‌పల్లి: మండలంలోని కొలిప్యాక్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు జెస్సు వినోద్ కుమార్ షూస్‌ను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిరిల్ రావు, వీడీసీ సభ్యుడు గంగారాం, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు..

మోపాల్: మండలంలోని మంచిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలకు 2005–06 పదో తరగతి పూర్వ విద్యార్థులు పది బెంచీలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం బి సాయిలు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లి ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన సమ్రీన్ ఫాతిమాను పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. జిల్లాలో మొదటి సారి ఉర్దూ మీడియం విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని ఎంఈవో శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గాయత్రి, ఎస్‌ఎంసీ చైర్మన్ సలీం, జీపీ కార్యదర్శి నగేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకులపై కేసు కొట్టివేత


కోర్టు వద్ద సీపీఎం నాయకులు

నిజామాబాద్ సిటీ: ఆర్టీసీ కార్మికులు చేసిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నేతలపై 2019లో అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. సీపీఎం నాయకులు రమేశ్‌బాబు, నూర్జహాన్, రాములు, శ్రీనివాస్, సతీశ్, పద్మ, గోవర్ధన్, కృష్ణ, మధుల పేర్లు కేసులో చేర్చింది. ఆరు సంవత్సరాలు సాగిన ఈ కేసును చివరికి జిల్లా కోర్టు రెండవ సెషన్ జడ్జి కొట్టివేస్తూ బుధవారం తీర్పు ఇచ్చారు. తీర్పు అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. అక్రమ కేసులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలపడం వ్యక్తుల హక్కుగా వివరించారు. సీపీఎం తరఫున ప్రముఖ న్యాయవాది ఆశ నారాయణ వాదించారు.

జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు



జక్రాన్‌పల్లి: మండలంలోని చింతలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం విజ్ఞాన యాత్రలో భాగంగా శ్రీరాంసాగర్ జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ఎలా జరుగుతుందో అధికారులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, గంట అశోక్ గంగారాం, బలిరాం శ్రీనివాస్, సంజీవ్ ఉమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కుర్మ భవన్‌కు స్థలం కేటాయించాలి


ఎమ్మెల్యేతో నుడా చైర్మన్, నాయకులు

నిజామాబాద్ సిటీ: కుర్మ భవన్, కుర్మ విద్యార్థులకు హాస్టల్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని నుడా చైర్మన్ కేశ వేణు రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కోరారు. బుధవారం జిల్లాకేంద్రంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నుడా చైర్మన్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన కుర్మ కుల సంఘం పెద్దలు ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేశ వేణు మాట్లాడుతూ.. చదువుకుంటున్న సంఘం పేద విద్యార్థుల నివాసం కోసం హాస్టల్ భవనం అలాగే సంఘం భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. నగరంలో సరిపడా ప్రభుత్వ స్థలం లేనందున రూరల్ పరిధిలో కేటాయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దార్‌కు స్థల పరిశీలన చేయాలని సూచించారు. త్వరలోనే సంఘం, హాస్టల్ భవనాలకు స్థలం కేటాయించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కుర్మ సంఘం నాయకులు గోపరి లక్ష్మణ్, మోపాల్ నర్సయ్య, తిర్మన్‌పల్లి కౌలాస్ మోహన్, తిరుపతి, మోస్ర భూమన్న, గంగాధర్ ఉన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


ఖానాపూర్ శివారులోని డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి


మార్కెట్‌యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెలే

నిజామాబాద్ రూరల్: పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఖానాపూర్ శివారులో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇల్లను వినియోగంలోకి తీసుకురాలేదని, వాటికి వెచ్చించిన నిధులను వృథా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని అన్నారు. అర్హులకు అందని ఇళ్లను రెండో విడతలో అందిస్తామని పేర్కొన్నారు. ఖానాపూర్‌లో ఉన్న డబుల్ బెడ్ రూంలు రెండో విడతలో ఇళ్ల స్థలాలు లేనివారికి ఖానాపూర్, కాలూర్ లబ్ధిదారులకు కేటాయించాలనే ఉద్దేశంతో పరిశీలిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గాంధీగంజ్‌లో ఉన్న దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కూరగాయల మార్కెట్ కబ్జాకు గురవుతుందనే విషయం తెలుసుకొని మార్కెట్ మ్యాప్ చూసి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. స్థలం కబ్జాకు గురికాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, ఐసీడీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, నాయకులు వాసుబాబు, సాంసన్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


హుస్సేన్‌నగర్‌లో చెక్కులను అందజేస్తున్న నాయకులు


దమన్నపేట్‌లో..

సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్, పోత్నూర్, సిరికొండలో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. హుస్సేన్‌నగర్‌లో సుమలత, చాకలి రమేశ్, పోత్నూర్‌లో శ్యామల, నేనావత్ గంతి, గాండ్ల నర్సయ్య, సిరికొండ పలువురు బాధితులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేసినట్లు స్థానిక నాయకులు తెలిపారు. కార్యక్రమాల్లో హుస్సేన్‌నగర్‌లో పార్టీ మండల ఉపాధ్యక్షుడు మల్లేశ్, కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దుమాల గంగారెడ్డి, తీనేటి నరేశ్, మహిపాల్, భూస్వామి, పోత్నూర్‌లో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సయ్య, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, లింబన్న, వినోద్, గంగాధర్‌గౌడ్, దశరెడ్డి, సిరికొండలో దేగాం సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండలంలోని దమన్నపేట్‌లో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు.

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను డీసీసీ డెలిగేట్ వాసుబాబు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రామకృష్ణ, నాయకులు సింగు ప్రవీణ్, మురహరి, మురళి, దావీదు, బాబు, రాజేశ్వర్, అర్షద్, బాబా, రహీం, కార్యకర్తలు పాల్గొన్నారు.


బాధితులకు చెక్కులు అందజేస్తున్న వాసుబాబు

సంక్షిప్తం

గవర్నర్‌ను కలిసిన మారయ్యగౌడ్



నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్యగౌడ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిచ్‌పల్లి బెటాలియన్‌లో గవర్నర్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. జిల్లాలోని విద్యావ్యవస్థ, యూనివర్సిటీ విద్యా బోధన, పలు అంశాలపై చర్చించారు.

వామపక్షనాయకుల ముందస్తు అరెస్టులు

నిజామాబాద్ సిటీ/ సిరికొండ: రాష్ట్ర గవర్నర్ జిల్లా పర్యటన సందర్భంగా ముందస్తుగా పలువురు వామపక్ష నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం తెల్లవారుజామునే ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ తదితర వామపక్ష నాయకులను, సిరికొండ మండలానికి చెందిన సీపీఐఎంఎల్ మాస్‌లైన్, న్యూడెమోక్రసీ పార్టీలకు చెందిన నాయకులను ముందుగా అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీసు స్టేషన్‌లకు తరలించారు. తర్వాత పూచీకత్తుపై విడుదలచేశారు. తమను అన్యాయంగా అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని వామపక్ష నాయకులు మండిపడ్డారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్యాయత్నం

మోపాల్: మండలంలోని గుండ్యానాయక్ తండాకు చెందిన ప్రకాశ్ కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశ్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. కొన్నిరోజులుగా కుటుంబీకుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రకాశ్ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ప్రకాశ్‌ను జిల్లాకేంద్రాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా ప్రకాశ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

గంజాయి తరలిస్తున్న ముగ్గురిపై కేసు

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ గిర్ని చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పట్టుకున్నట్లు ఎస్సై జె రామకృష్ణ బుధవారం తెలిపారు. గడ్కోల్ గ్రామానికి చెందిన బూర్గుల మనీష్, కంచు కార్తీక్, పెద్దపుల్ల వంశీల వద్ద 60 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి ఆర్మూర్ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ పరిస్థితి విషమం



మోపాల్: మండలంలోని కంజర్ శివారులో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సరికెల భూమన్నకు చెందిన ట్రాక్టర్‌పై రొడ్డోల్ల గంగారాం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ట్రాక్టర్ మోపాల్ నుంచి కంజర్‌కు వెళ్తుండగా కంజర్ శివారులోని పాత రోడ్డులో అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ లోపల డ్రైవర్ ఇరుక్కుపోవడంతో స్థానికులు జేసీబీ సహాయంతో గంగారాంను బయటికి తీశారు. ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.